PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

All Insurances Cashless Available | 24/7 Emergency Services | Ambulance Services

+91 85230 89599 +91 86889 09384

Web: www.jaitrahospitals.com Mail: info@jaitrahospitals.com

Address: Beside ITI, NH 44, Chandra Nagar, Medchal, Telangana 501401.

విజయవాడ, హైదరాబాద్ ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు సంపుటి : 01 సంచిక : 146 శుక్రవారం , ఆగస్టు 28 , 2026 , పేజీలు - 8 వెల : 3 /-

# దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

- ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమం
- క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అలథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తా_యన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోవడానికి యువశక్తితో మిగతా2లో...

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు ● ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రులు ● సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు



**పల్నాడు, ఆగస్టు 27:** పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరి పేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మిగతా2లో...

# మత్స్యకారులు అందరూ సురక్షితం



**అమరావతి, ఆగస్టు 27:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. అల్లవరం మండలం నుండి చేపల వేటుకు వెళ్లిన బోటులోని సిబ్బంది అందరూ పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నారు.

మిగతా2లో...

# రెండోదశ భూసమీకరణ రైతులకు రుణమాఫీ

- మంగళగిరికి కూడా అమరావతి నుంచే నీరు
- సిఆర్‌డిఏ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి నారాయణ



**అమరావతి, ఆగస్టు 27:** మంగళగిరికి రాజధాని అమరావతి నుంచి తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 65వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న వివిధ పరిపాలన అనుమతులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను మంత్రి నారాయణ వివరిం చారు. 06.01.2026 ముందు వరకూ లోన్లు తీసుకున్న రెండో దశ భూసమీకరణ రైతులకు కూడా రుణమాఫీ మిగతా2లో...

# 1,600 మంది గల్లంతు



**నేపాల్, ఆగస్టు 27:** నేపాల్-టిబెట్ సరహద్దుల వెంబడి సంభవించిన మెరుపు వరదల బీభత్సంలో 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ప్రకటించింది. మరో 200 మంది భారతీయ పౌరులు చైనా వైపు టిబెట్‌లో చిక్కుకుపోయినట్టు తెలిపింది. వారికి సహాయం అందించేందుకు రెండు దేశాల అధికారులతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు పేర్కొంది. నేపాల్‌లో సహాయక చర్యలు వేగం పుంజుకున్న నేపథ్యంలో సంక్షోభాన్ని అధిగమించేందుకు ఆ దేశానికి భారత్ భుజం భుజం కలిగి అండగా మిగతా2లో...

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

- మిగిలిన 5,269 మందికి 31లోగా ఇచ్చేందుకు చర్యలు
- కొత్త వారి కోసం కూడా రాష్ట్రానికి 1.90 లక్షల డోసుల వ్యాక్సిన్ త్వరలో రాక
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి, ఆగస్టు 27:** హెచ్ పీవీ టీకా (వ్యాక్సిన్) పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్‌ను 14-15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. స్వర్ణ గ్రామ/వార్డు లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి 14 ఏళ్లు వచ్చి 15 ఏళ్లు దాటని బాలికలు 3,45,377 మంది ఉండగా వీరిలో గురువారం మధ్యాహ్నం నాటికి మిగతా2లో...

# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన మిగతా2లో...

# ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా..?

- జగన్ దుర్నీతి వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేకుండా పోయాయి
- గత వైఫల్యాలను కప్పిపుచ్చి మాట్లాడడం విడ్డూరంగా ఉంది
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు



**విశాఖపట్నం, ఆగస్టు 27:** ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం దెబ్బతినడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగనే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆ రోజు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే.. నేడు ఎల్ నినో వచ్చినా సరే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. గురువారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తు కంటే అతి పెద్ద విపత్తు గొడ్డలి పార్టీ అని అభివర్ణించారు. ఎల్ నినో కంటే పెద్ద విపత్తు వైఎస్ జగన్ మిగతా2లో...

# ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

- 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు
- కన్నీటి పర్యంతం అయిన జగ్గీవాసుదేవ్



2లో

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు.

## దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

## మత్స్యకారులు అందరూ సురక్షితం

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారందరినీ వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు... దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఏ మాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

## రెండోదశ భూసమీకరణ రైతులకు రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

వర్తింప చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ వివరించారు. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్‌కు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి చెప్పారు. మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29 గ్రామాల లే ఔట్ రోడ్లు బీటీగా మార్చేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా అంగీకారం తెలిపామని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐవోసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## 1,600 మంది గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తుందని ప్రకటించింది. ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ గురువారంనాడిక్కడ మీడియాతో ఆ వివరాలు తెలియజేశారు. 'ఆచూకీ తెలియకుండా పోయిన 288 మంది భారతీయుల్లో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది ఉన్నారు. ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం వారి ఆచూకీ కోసం ప్రాజెక్టు అధికారులతో సంప్రదిస్తోంది.తమిళనాడు నుంచి 37 మంది, 49 మందితో కూడిన రెండు పర్యాటక బృందాలు ఉన్నాయి. వీరు సమ్రాట్, ఫ్లై ఎవరెస్ట్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా కైలాస్ మానసరోవర్ యాత్రకు వెళ్లారు. పశ్చిమబెంగాల్ నుంచి 32 మంది, కేరళ నుంచి 33 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 62 మంది ఉన్నారు. సహాయక చర్యల విషయంలో నేపాల్ అధికారులతో సంప్రదిస్తున్నాం' అని జైశ్వాల్ చెప్పారు. ఇంతవరకూ తమిళనాడుకు చెందిన 21 మందిని కాపాడినట్టు జైశ్వాల్ తెలిపారు. చైనా వైపు 200 మంది భారతీయులు కోసం విజ్ఞప్తి చేస్తున్నారని చెప్పారు. వీరిలో 95 మంది గార్చస్‌లో ఉన్నారని, వారు నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ముందుకు సాగుతున్నారని చెప్పారు. మరో నలుగురు గీలాంగ్ నగరంలో, 13 మంది జుటుల్పుక్‌లో ఉన్నారన వివరించారు. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితి ఎక్కడికప్పుడు మారుతోందన్నారు. భారతీయులను రక్షించేందుకు సంబంధిత అధికారులతో భారత నిరంతం సంప్రదింపులు సాగిస్తోందన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

3,40,108 మంది (98.47%)కి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన 5,269 మంది బాలికలకు ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం ద్వారా మొదట్లో ఉన్న అపోహలు దూరం కావడంతో తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి పేర్కొన్నారు. తొలుత ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన వారికి వ్యాక్సిన్ పంపిణీ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 98.47% మేర పురోగతి సాధించడం విశేషం. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ తక్కువగా ఉందన్న ఉద్దేశంతో డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమాచారాన్ని పంపించింది. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం త్వరలో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి పంపించబోతుంది. 14 ఏళ్ల బాలికలు తల్లిదండ్రులతో కలిసి నేరుగా పీహెచ్సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లాలనిఅధికారులు సూచించారు.వ్యాక్సిన్ పంపిణీ పురోగతిని అనుసరించి కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యనీ ఇస్తోంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభమైన అనంతరం రెండు దపాలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసులు రాష్ట్రానికి అందాయి.

దీనికి సమర్థంగా సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. డిసెంబరు 31 అనంతరం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీని రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో జతచేస్తారు. వ్యాక్సిన్ పొందిన 3.40 లక్షల మంది బాలికలకు సంబంధించి ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు. " గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నివారించడంలో హెచ్ పీవీ వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తోంది. ఈ వ్యాక్సిన్ అత్యంత ప్రభావంతమైంది. సురక్షితమైంది కూడా. టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే వేచి ఉంటున్నారు. రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందిస్తున్నారు. గార్డాసిల్-4 క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సింగిల్ డోస్ విధానంలో 0.5 మి.లీ. మోతాదుగా ఎడమ పైభుజంలో ఇంట్రామస్క్యులర్‌గా ఇస్తున్నారు" అని చక్రధర్‌బాబు వివరించారు. **జిల్లాల వారీగా టీకా సాధన** 100 శాతం, అంతకంటే ఎక్కువ సాధించిన జిల్లాలు: అనకాపల్లి (103.93%), బాపట్ల (103.54%), చిత్తూరు (102.15%), కాకినాడ (103.51%), కోనసీమ (104.12%), కృష్ణా (103.52%), కర్నూలు (100.72%), మార్కాపురం (112.64%), నంద్యాల (101.83%), ఎన్‌టీఆర్ (100.58%), పల్నాడు (103.49%), పార్వతీపురం మన్యం (101.51%), తిరుపతి (103.67%), వైఎస్సార్ (105.00%).90 నుంచి 99.99 శాతం సాధించిన జిల్లాలు: అనంతపురము (94.57%), అన్నమయ్య (95.81%), తూర్పు గోదావరి (99.52%), ఏలూరు (94.30%), ప్రకాశం (96.45%), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (95.22%), శ్రీ సత్యసాయి (96.37%), శ్రీకాకుళం (98.12%), విశాఖపట్నం (92.31%), విజయనగరం (98.84%), పశ్చిమ గోదావరి (99.19%).90 శాతం కంటే తక్కువ సాధించిన జిల్లాలు: అల్లూరి సీతారామరాజు (54.51%), గుంటూరు (87.20%), పోలవరం (73.68%).

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

**చెన్నై,ఆగస్టు 27:** ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామ నుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటి పర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచు చరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

## యథావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూట మి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమి టేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పం దన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా..?

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులు గాడిలో పెట్టామని తెలిపారు. ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్.. తన పాలనను గుర్తుపెట్టుకోకుండా మాట్లాడడం బాధగా ఉందన్నారు. ఎల్ నినో పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల పట్ల ప్రేమ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని వైసీపీ అధినేత జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. సభలో అన్నింటికీ సమాధానాలు చెబుతామని పేర్కొన్నారు. సెంబ్లీకి వస్తే ఐదేళ్లలో చేసిన అన్యాయాలను నిలబెట్టి.. చెబుతామంటూ జగన్‌కు స్పష్టం చేశారు. క్రిమినల్ ముసుగులో ఓ రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఇలా ఉన్నాడని.. లేకుంటే ఎక్కడ ఉండే వాడో కూడా తెలియదని జగన్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. రెడ్ బుక్ ఇంప్లిమెంట్ చేస్తే.. ఎవరైనా ఉంటారా? అని వైసీపీ అధినేతను సూటిగా ప్రశ్నించారు.

తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మ వద్ద కక్ష సాధింపులు ఉండవని కుండబద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో బలహీన వర్గాలపై దమనకాండకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన మాయ మాటలు బీసీలు నమ్మరని అన్నారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ని తగ్గించింది జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టీడీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందని అన్నారు. కానీ వైసీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందా? అని వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం తాము బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని చూస్తే.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్‌పై అచ్చె న్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను భయపెట్టి, ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శిం చారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అయితే సీట్లు ఇవ్వనంటూ భయపెడుతున్నారని ఆరోపించారు. తిరిగి ఎన్నికలు సాఫీగా జరిగితే తామే గెలుస్తామని వైఎస్ జగన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు.

# సంపాదకీయం



## మంచుకొండల్లో మహా విలయం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి.ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది.ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది.

ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి.

ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది.

దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

# రాఖీ పౌర్ణమి..అన్నా చెల్లెళ్ల ప్రేమకు ప్రతీక



**హైదరాబాద్,ఆగస్ట్27:** 'రక్ష' అనగా రక్షణ, 'బంధన్' అనగా కట్టడం. సోదరి తన సోదరుని క్షేమంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ చేతికి రాఖీ కడుతుంది.హామీ: సోదరుడు ఎల్లప్పుడూ తనకు అండగా ఉంటానని, రక్షణగా నిలుస్తానని సోదరీమణులకు మాటిస్తాడు. హిందూ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం, శ్రావణ మాసం పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. దీనిని కొన్ని ప్రాంతాలలో 'జంధ్యాల పౌర్ణమి' అని కూడా పిలుస్తారు, ఎందుకంటే ఈ రోజే జంధ్యం ధరించే వారు కొత్త జంధ్యాన్ని మారుస్తారు. హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ వేడుక సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీకట్టి స్వీటు తినిపించి, హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. శుక్రవారం అక్కాతమ్ముళ్లు ఆనందోత్సవాల మధ్య పండుగను జరుపుకోనున్నారు. ఈ రాఖీ పర్వది నంపై నాటి నుంచి నేటి వరకు అనేక పురాణాలు, కథలు ప్రచారంలో ఉన్నాయి.

సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు ఎంతో రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుందన్‌లు, మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేం దుకు కార్టున్ రాఖీలు కూడా వచ్చాయి.పాతకాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు. రానురాను అవి చిన్నగా మారిపోయా యి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్దపెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనిమిచ్చాయి. ఈనెల 28న సూర్యోదయం నుంచి సూర్యస్తమయం వరకు సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు.

# నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

**చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు ముప్పే**

**బ్రహ్మపుత్రపై చైనా డ్యామ్ ప్రకృతి విలయానికి నాంది**

**ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్27:** నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయొచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'పైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూకంపాల కారణంగా భారీ వరదలు ఏర్పడతాయి. అందుకే మైడాగ్ డ్యామ్ భారత్‌కు వాటర్ బాంబ్‌లాగా మారనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మైడాగ్ డ్యామ్ విషయంలో భారతీయులు మాత్రమే ఆందోళన చెందడం లేదు. చైనా భూగర్భ శాస్త్రవేత్తలూ ఈ ఆనకట్టపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే బ్రహ్మపుత్ర జలాలు చైనా ఆధీనంలోకి వెళ్లిపోతాయి. చైనా జలాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి ఒకేసారి విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వరదలు ఏర్పడతాయి. మరోవైపు సమ్మర్ లాంటి సీజన్లలో చైనా అసలు జలాలనే విడుదల చేయకపోతే నీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి భారత్ కూడా ఓ మెగా ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిందని సమాచారం.

# వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**• భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు**

**వాషింగ్టన్,ఆగస్ట్27:** అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది. అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసు కున్నాయి .వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి.



ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్ మెంట్లను మార్చుతు న్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తు దారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందిం చారు ఇటీవలి కాలంలో అమెరికాలో హెచ్-1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం అమెరికా యూనివర్సిటీలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందువల్ల వీసా ఇంటర్వ్యూ తేదీలో ఆలస్యం విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలను, ఉద్యోగుల జాబ్ ఆఫర్లు, రీలొకేషన్ ప్లాన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు లేదా హెచ్-1బీ వర్క్ వీసాల జారీని పూర్తిగా నిలిపివేయలేదు. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌లో అంతరాయం మాత్రమే ఏర్పడుతోంది. అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణు లకు ముఖ్యమైన గమ్యస్థానంగానే ఉంది. అయితే వీసా స్క్రీనింగ్, హెచ్-1బీ ఖర్చులు, ఎంపిక విధానం, ఎఫ్-1 నిబంధనలు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

శుక్రవారం ,
ఆగస్టు 28, 2026

PRGI NO: APTEL/26/A1204
కింగ్
డైలీ న్యూస్ పేపర్
King Daily News Paper



# స్వచ్ఛమైన విధులతో దోషరహిత ఓటర్ల జాబితా

- సర్ ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకే అగ్రస్థానం
- ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో చొరవ అభినందనీయం
- అక్టోబర్ 3న తుది జాబితా ప్రచురణ వరకు సమష్టి కృషితో ముందుకెళ్లండి
- పైస్థాయి నుంచి బీఎల్‌వో వరకు సరైన సమన్వయం, సహకార స్ఫూర్తి కీలకం
- జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ






**విజయవాడ, ఆగస్టు 27, 2026**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ లోపాలకు తావులేకుండా దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సమష్టి కృషి అవసరమని.. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు చూపిన చొరవ అభినందనీయమని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో రాష్ట్రంలో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్షా, పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, అదనపు సీఈవో ఎస్.డిల్లీరావుతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, గుంటూరు కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, పల్నాడు కలెక్టర్ డా. కృతికా శుక్లా, తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి, బాపట్ల కలెక్టర్ డా. వి.వినోద్ కుమార్, ఆయా జిల్లాల ఈఆర్‌వోలు ప్రత్యక్షంగా హాజరుకాగా వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రస్తుతం నోటీసుల జారీ, విచారణ, క్లెయిములు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్.. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 43,71,397 నోటీసుల పంపిణీ కాగా 16,23,774 నోటీసులపై క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ముందంజలో ఉన్న జిల్లాలను అభినందిస్తూ.. మిగిలిన జిల్లాల్లోనూ నాణ్యంగా, వేగంగా, పారదర్శకంగా సర్ స్ఫూర్తికి అనుగుణంగా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు దిశానిర్దేశం చేశారు. నోటీసులపై విచారణకు సంబంధించి ప్రస్తుతానికి అత్యల్పంగా 15.18 శాతం మాత్రమే పెండింగ్ ఉన్న కర్నూలు జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీల మధ్య సమన్వయం, సహకారం అనేవి ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కీలకమని.. ఎవరికి ఏ సందేహమున్నా నివృత్తి చేయడం, సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు సంతృప్తికరంగా అందించడంలో ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ సూచించారు. ప్రస్తుత దశలో జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిబంధనల ప్రకారం సరైన కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. వృద్ధాప్యం, అనారోగ్యం వంటి వివిధ కారణాల వల్ల విచారణకు హాజరుకాలేని పక్షంలో ఈఆర్‌వో/ఏఈఆర్‌వో – బీఎల్‌వోను సమన్వయం చేసుకుంటూ ఇంటి సందర్శన, వివిధ మార్గాల ద్వారా ఓటర్లకు సహాయసహకారాలు అందించాలన్నారు. అదేవిధంగా నోటీసులపై విచారణ అనంతరం క్వాసీ జ్యుడీషియల్ అధికారి అయిన ఏఈఆర్‌వోలు సమస్యను అర్థం చేసుకొని న్యాయమైన తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశం సందర్భంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఫారం–6, ఫారం–7, ఫారం–8 తదితరాల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలనూ డా. పవన్ కుమార్ శర్మ పరిశీలించారు.

# ఉద్యోగ అవకాశంతో రాణించాలి

- సెంచూరియన్ యూనివర్సిటీతో కొలువులు
- నియామక పత్రాలు అందజేత
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు



**విజయనగరం, ఆగస్టు 27,**
ఉద్యోగ అవకాశం వచ్చిన యువకులు రాణించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో గజపతినగరం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన జాబ్ మేళా ఇంటర్వ్యూలలో ఎంపికైన విద్యార్థులకు గురువారం మంత్రి క్యాంప్ కార్యాలయం నందు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఉద్యోగం పొందటం కష్టంగా ఉందని, తొలి ప్రయత్నం లోనే ఉద్యోగం సాధించడం మీ అదృష్టం తో పాటు, మీ ప్రతిభకు తార్కాణమన్నారు. నేటి చిన్న ఉద్యోగమే భవిష్యత్తులో అనుభవం నేర్పుతుందన్నారు. పెద్ద ఉద్యోగానికి ఈ చిన్న ఉద్యోగ అనుభవం పనిచేస్తుందని, ఎక్స్పీరియన్స్ ఉంటేనే అర్హత సాధిస్తారనే విషయాన్ని యువత తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, యువ నాయకుడు లోకేష్ గారు నిరుద్యోగ సమస్య పరిష్కరించడం కోసం పరిశ్రమలు స్థాపన చేయటం జరుగుతుందన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వారు నియోజకవర్గ నిరుద్యోగ యువతకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. 27 మందికి నియామక పత్రాలు అందజేశారు. వీరికి జీతంతో పాటు వసతి సౌకర్యం కూడా సెంచూరియన్ యూనివర్సిటీ వారు అందించటం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ , నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు

# విశాఖ ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో -- 2026

## - మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆహ్వానం



**అమరావతి, ఆగస్టు 27 :** విశాఖపట్నంలో సెప్టెంబర్ 11వ తేదీన జరిగే "ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో -- 2026" ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు గారు, ప్రతినిధి లక్ష్మీనారాయణ గారు మంత్రిని సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కలసి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు ఎక్స్‌పో వివరాలను మంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పోర్ట్–ఆధారిత అభివృద్ధి, ఫిన్‌టెక్ మరియు అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూడు రోజుల పాటు ఈ బిజినెస్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ ప్రదర్శనలో గ్రీన్ ఎనర్జీ, ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, హెల్త్‌కేర్ వంటి కీలక రంగాలకు చెందిన 500కి పైగా ఎంఎస్ఎంఈలు, 60కి పైగా స్టార్టప్‌లు, 180కి పైగా ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తారని... మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోకు దాదాపు 40,000 మందికి పైగా సందర్శకులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు ఛాంబర్స్ తెలిపారు.

# జువినైల్ జస్టిస్ యాక్ట్(2015) పై సమీక్షా









**ఎన్టీఆర్ జిల్లా -- విజయవాడతేదీ: 27-08-2026**
రాష్ట్ర మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీమతి ఏ సూర్య కుమారి జువినైల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అమలు చేస్తున్న జువినైల్ జస్టిస్ యాక్ట్ పై సమీక్షా నిర్వహించారు. ఈ యాక్ట్ ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సెప్టెంబర్ 5న నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జువినైల్ జస్టిస్ కమిటీ మీటింగ్ కు ఈరోజు విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువినైల్ జస్టిస్ బోర్డు మరియు వివిధ శాఖలతో సమీక్షా నిర్వహించడం జరిగింది. ఈ 10 సంవత్సరాలలో యాక్ట్ అమలు చేస్తున్నా కార్యక్రమాలు శాఖలావారీగా వివరించారు. అదేవిధంగా సమర్ధవంతంగా అమలుచేయుటకు అన్ని శాఖలనుండి సూచనలు మరియు సలహాలు తీసుకున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీ యమ్ వేణుగోపాల్ రెడ్డి, జువినైల్ వెల్ఫేర్ డైరెక్టర్ శ్రీమతి వసంత బాల, మిషన్ వాత్సల్య జాయింట్ డైరెక్టర్ శ్రీమతి శిరీష, ఏసీపీ దైవ ప్రసాద్, యూనిసెఫ్ ప్రతినిధులు, డీపీఓలు, డీసీపీవో లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ లు, మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటలో ఈ నెల 28న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

**జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి**
**.: జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**



**విజయవాడ: ఆగస్టు 27,2026:**
"ఒక నెల – ఒక నియోజకవర్గశీ – నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆగస్టు 28వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జగ్గయ్యపేట ఎస్.వి.ఎస్ కళ్యాణ మండపంలో ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ కోరారు.

# సర్‌లో వేగం.. విచారణలో పారదర్శకత..

# ఓటర్ల జాబితాలో కచ్చితత్వం

-- ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల్లో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్ష
-- నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలో రెండు జిల్లాల అధికారుల పురోగతిపై అభినందనలు








**విజయవాడ, ఆగస్టు 27, 2026**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై గురువారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ.. ఎన్‌టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లాలకు సంబంధించి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కృష్ణా కలెక్టర్ డా. డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రెండు జిల్లాలకు సంబంధించిన 14 మంది ఈఆర్‌వోలు, ఒక్కో శాసనసభ నియోజకవర్గం నుంచి నలుగురు పోలింగ్ బూత్ స్థాయి అధికారులు హాజరయ్యారు. సర్ ప్రక్రియలోని ప్రస్తుత దశలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారం గురించి డా. పవన్ కుమార్ శర్మ చర్చించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అందుబాటులో లేని ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, ఒకచోట కంటే ఎక్కువ చోట్ల జాబితాలలో పేర్లను కలిగిన ఓటర్లు తదితర విషయాలలో ప్రత్యేక దృష్టితో కృషిచేసి గణనీయమైన ఫలితాలను సాధించినందుకు రెండు జిల్లాల అధికారులను అభినందించారు. అదేవిధంగా నోటీసుల జారీ, విచారణ దశ విషయంలో సాధించిన పురోగతిపైనా, ఎదుర్కొన్న సమస్యలు, వాటి పరిష్కారాల గురించి చర్చించారు. ఎన్‌టీఆర్ జిల్లాలో 1,93,574, కృష్ణా జిల్లాలో 1,09,902 నోటీసులు జారీ చేయడం జరిగింది. ఎన్‌టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు 90,588, కృష్ణా జిల్లాలో 49,277 నోటీసులకు సంబంధించి ఓటర్లను విచారించడం జరిగింది. ఫారం 6, 7, 8 స్వీకరణ, పరిష్కారంలోనూ ప్రగతి దిశగా పయనిస్తున్నాయి. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారాన్ని నిర్దిష్ట గడువులోగా అత్యంత పారదర్శకత, కచ్చితత్వంతో పూర్తిచేయనున్నట్లు జిల్లాల ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, ఓటు భద్రతకు భరోసా కల్పించేలా సమష్టి కృషితో ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు.

PRGI NO: APTEL/26/A1204

## వేరుశనగ విత్తనాల పంపిణీలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి



**దేవనకొండ ఆగస్టు 27:** సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం (ఏఐకేఎస్) మండల నాయకులు రామాంజనేయులు, వెంకటరాముడు డిమాండ్ చేశారు.గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి దేవనకొండ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.కేంద్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై రైతులకు ఉచితంగా అందించాల్సిన వేరుశనగ విత్తనాలను కొందరు అధికారులు అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. రైతులకు ఈ పథకం గురించి ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, అధికారులు ప్రచారం చేయకపోవడంతో అర్హులైన రైతులు ప్రయోజనం పొందలేకపోయారని అన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్, రబీతో పాటు 2026 ఖరీఫ్‌కు రైతుల కోసం కేటాయించిన విత్తనాలను కూడా అక్రమంగా విక్రయించినట్లు ఆరోపించారు. సబ్సిడీలు, సంక్షేమ పథకాలు రైతులకు చేరకుండా మధ్యలోనే దారి మళ్లిస్తే సహించేది లేదన్నారు.విత్తనాల పంపిణీలో జరిగిన అవకతవకలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, అక్రమంగా తీసుకున్న మొత్తాన్ని రికవరీ చేయాలని కోరారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి, అవినీతికి పాల్పడినట్లు తేలిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు, ఏపీ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు బయోజీమ్ ప్రగతి స్కాలర్‌షిప్ పంపిణీ



**దేవనకొండ ఆగస్టు 27:** దేవనకొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోస్టాట్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు బయోజీమ్ ప్రగతి స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.3,000 చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు.ఈ సందర్భంగా కంపెనీ టెరిటరీ మేనేజర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ..గత 40 సంవత్సరాలుగా బయోస్టాట్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి నుంచి 10వ తరగతికి ప్రమోట్ అయిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తోందన్నారు. పేద విద్యార్థులు విద్యలో రాణించేందుకు సంస్థ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో దేవనకొండ వెంకట సాయి ట్రేడర్స్ నిర్వాహకులు సదాశివరావు, వేణుగోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు విఠల్, షంషాద్ బేగం, సుజాత, కంపెనీ సేల్స్ ఆఫీసర్ రఘు, సిబ్బంది రామాంజనేయులు, వీరుపాపురం రవి, ఎమ్మిగనూరు రవి పాల్గొన్నారు.

## నూతన రామాలయ నిర్మాణానికి బీటెక్ రవి శంకుస్థాపన

### - అంకాలమ్మ గూడూరు కొత్తపాలెంలో ఘనంగా పూజా కార్యక్రమాలు





**సింహాద్రిపురంఆగస్టు 27**మండల పరిధిలోని అంకాలమ్మ గూడూరు కొత్తపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీరాముడి దేవాలయ నిర్మాణానికి పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి గురువారం భూమిపూజ చేసి,శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు.అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందాలని,శ్రీరాముడి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని కోరుతూ,గ్రామ ప్రజల ఆధ్యాత్మిక,అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకు లు బాబు రెడ్డి, సాంబశివరెడ్డి,సతీష్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి,ధ్రువకుమార్ రెడ్డితో పాటు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నంద్యాల పట్టణంలో టిడిపి నేత నిర్వాకం..

**నంద్యాల, ఆగస్టు 27** నంద్యాల పట్టణంలోని కుందునది ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లికి దాతలు విరాళంగా ఇచ్చిన డబ్బును, ఆభరణాలను తన ఆధీనంలో పెట్టుకున్న టిడిపి నేత.శ్రావణమాసం సందర్భంగా ప్రతి మంగళవారం, శుక్రవారం ఆభరణాలు లేకుండానే గంగమ్మకు పూజలు చేస్తున్న ప్రస్తుత గుడి నిర్వాహకులు.చట్ట ప్రకారం గంగమ్మ గుడి కమిటీ సభ్యులు మారినా నేను చెప్పిన వాళ్ళకే కమిటీ బాధ్యతలు అప్పజెప్పాలని హుకూం జారీ చేస్తున్న టిడిపి నేత.తనకున్న పలుకుబడితో వివిధ పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు పెట్టి చివరకు అబాసు పాలవుతున్న ఆ టిడిపి నేత.ప్రతి సంవత్సరం కార్తీక వనభోజనాలంటూ, మహానందిలో అన్నదానమంటూ వసూలు చేసి లెక్కలు చెప్పకపోవడంతో అ టిడిపి నేతపై అగ్రహం వ్యక్తం చేస్తున్న ఆ కమ్యూనిటీ ప్రజలు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ స్పందించి ఆ టిడిపి నేత ఆధీనంలో ఉన్న గంగమ్మ ఆభరణాలను, డబ్బును గుడి నిర్వాహకులకు ఇప్పించాలని కోరుకుంటున్నారు.

## కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

### పత్తికొండలో న్యాయవాదుల బైక్ ర్యాలీ






**పత్తికొండ ఆగస్టు 27** రాయలసీమ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. మధుబాబు డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం గురువారం పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు ఆధ్వర్యంలో స్థానిక అతిథి గృహం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. 2014లో జరిగిన శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హోసూరు పర్యటన సందర్భంగా 90 రోజుల్లో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు సుదూర ప్రాంతంలో ఉన్న హైకోర్టుకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. లేకుంటే రాయలసీమ జేఏసీ పిలుపు మేరకు వివిధ దశల్లో నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.అదేవిధంగా పత్తికొండ డివిజన్ కేంద్రంలో ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలు ఉన్నప్పటికీ సబ్‌కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.న్యాయవాదులు మల్లికార్జున, రవిప్రకాష్, నారాయణస్వామి, సురాజ్‌నబి, రంగస్వామి, రవి, జగదీష్, నెట్టేకల్లు, నరసింహులు, వాసు, సుధాకృష్ణ, భాస్కర్, రాజశేఖర్, అలీ, వీరేష్, మధు, నాగరాజు, నాగభూషణం, శ్రీను, రామంజి, బషీర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనాల అక్రమ విక్రయాలపై విచారణ జరపాలి

### 3 వేల క్వింటాళ్లు అక్రమంగా అమ్మారని ఆరోపణ

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..!

### ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య




**పత్తికొండ ఆగస్టు 27** -కర్నూలు జిల్లాలో రైతులకు 100 శాతం సబ్సిడీపై ఉచితంగా పంపిణీ చేయాల్సిన విశిష్ట వేరుశనగ కాయలు (విత్తనాలు) సుమారు 3 వేల క్వింటాళ్లను వ్యవసాయ శాఖ అధికారులు అక్రమంగా విక్రయించి, రూ.30 కోట్లకు పైగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు.గురువారం పత్తికొండలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలి వద్ద సభ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రయ్య మాట్లాడుతూ, రైతులకు పూర్తిగా ఉచితంగా అందించాల్సిన వేరుశనగ విత్తనాలను జిల్లాలో సక్రమంగా పంపిణీ చేయకుండా కొందరు అధికారులు అక్రమంగా విక్రయించారని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు 2026 ఖరీఫ్ సీజన్‌కు రైతుల కోసం 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను సరఫరా చేసిందని తెలిపారు. అయితే వాటి పంపిణీపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తగిన సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై విత్తనాలను అక్రమంగా విక్రయించారని ఆరోపించారు.ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, గూడూరు, హొలహర్వి, హొళగుంద, కోసిగి, కృష్ణగిరి, మద్దికెర, మంత్రాలయం, పత్తికొండ, పెద్దకడుబూరు, తుగ్గలి, వెల్దుర్తి, ఎమ్మిగనూరు తదితర మండలాల్లో ఈ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. సుమారు 3 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందకుండా పోయాయని, వాటి విలువ రూ.30 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు.ఇంత పెద్ద మొత్తంలో అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామస్థాయిలో నామమాత్రపు విచారణలు నిర్వహిస్తూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.వెంటనే సమగ్ర విచారణ చేపట్టి అక్రమంగా విక్రయించిన విత్తనాల సొమ్మును రికవరీ చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వ్యవసాయ శాఖ అధికారులను సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని కోరారు.ధర్నాకు రైతు సంఘం పత్తికొండ నియోజకవర్గ సమితి కార్యదర్శి బి. సురేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. తిమ్మయ్య, రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు ఎం. కారన్న, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజినేయులు, తాలూకా సీనియర్ నాయకుడు ఆర్. గురుదాసు, మండల సహాయ కార్యదర్శి జె. కాశీం, యువజన సమాఖ్య నాయకుడు ఉపేంద్ర, సీపీఐ పట్టణ నాయకులు ఎం.కె. సుంకన్న, ఎం. శ్రీనివాసులు, నాగేంద్ర, జి. బాషా, మాదన్న, లక్ష్మన్న, ఉరుకుందు, వీరేష్‌లు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీతహసీల్దార్శ్రీదేవికివినతిపత్రం సమర్పించారు.

## ఎన్‌టీఆర్ పట్టా భూ యజమానులకు చట్టబద్ధమైన హక్కు

**- పాత పట్టాలు ఉండి సరిఅయిన హక్కులు పొందలేని వారికి ప్రయోజనం**

**- భూముల సర్వే, రికార్డుల పరిశీలనతో అర్హత కలిగిన వారికి హక్కులు కల్పించాలి**

**- జిల్లాలో సుమారు 20 వేల మంది భూ యజమానులకు ప్రయోజనం**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, ఆగస్టు 27, 2026**

జిల్లాలో పాత పట్టాలు కలిగి ఉండి భూమిపై పూర్తి స్థాయిలో చట్టబద్ధమైన హక్కులు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులకు చట్టబద్ధమైన హక్కు కల్పించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలనిజిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్‌టీఆర్ పట్టా పథకం అమలు, అర్హులైన భూ యజమానులకు చట్టబద్ధమైన హక్కు కల్పించే ప్రక్రియపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాత పట్టాలు ఉన్నప్పటికీ భూమిపై పూర్తి స్థాయిలో హక్కులు పొందలేని భూ యజమానుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో గతంలో ఎన్ టి ఆర్ పట్టాలు పొందినప్పటికీ పూర్తి స్థాయిలో చట్టబద్ధమైన హక్కులు పొందలేకపోతున్న వారు సుమారు 20 వేల మంది ఉన్నట్లు తెలిపారు. అటువంటి భూ యజమానులకు హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.భూముల సమగ్ర సర్వే చేపట్టాలిఎన్‌టీఆర్ పట్టా భూములకు హక్కు కల్పించే ప్రక్రియలో భాగంగా సంబంధిత అధికారులు ముందుగా క్షేత్రస్థాయిలో భూములను సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాత పట్టాలో పేర్కొన్న భూమి, ప్రస్తుతం భౌతికంగా ఉన్న భూమి వివరాలను పరిశీలించి, విస్తీర్ణం, సరిహద్దులు, సర్వే నంబర్ తదితర అంశాలను నిర్ధారించాలి.భూముల సర్వే సమయంలో సంబంధిత భూ యజమానులను భాగస్వామ్యం చేసి, వారి వద్ద ఉన్న పాత పట్టాలు, భూ హక్కులకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట భూమి సరిహద్దులను గుర్తించి, భౌతిక పరిస్థితులను రికార్డుల్లోని వివరాలతో సరిపోల్చాలని ఆదేశించారు రెవెన్యూ రికార్డులను పరిశీలించాలిపాత పట్టాలు, రెవెన్యూ రికార్డులు, సర్వే రికార్డులు, భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. రికార్డుల్లో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వాటిని క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.భూ యజమాని వాస్తవంగా భూమిని కలిగి ఉన్నారా, పట్టాలోని వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోతున్నాయా, భూమికి సంబంధించి ఇతర అభ్యంతరాలు లేదా వివాదాలు ఉన్నాయా అనే అంశాలను కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.సర్వే, రికార్డుల పరిశీలన అనంతరం అర్హత కలిగిన భూ యజమానుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన వారికి ఎన్‌టీఆర్ పట్టా ద్వారా చట్టబద్ధమైన హక్కు కల్పించే ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు.భూముల సర్వే నుంచి ఎన్‌టీఆర్ పట్టా జారీ చేసే వరకు ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం, నిబంనల పాటింపు ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండలాల వారీగా ఎన్‌టీఆర్ పట్టా ద్వారా ప్రయోజనం పొందాల్సిన భూ యజమానుల వివరాలను సేకరించి, సర్వే పూర్తి చేయాల్సిన భూములను గుర్తించి, దశలవారీగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.చిరకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ఎన్‌టీఆర్ పట్టాదారులకు పరిష్కారం చూపి, అర్హులైన భూ యజమానులకు వారి భూమిపై చట్టబద్ధమైన హక్కును కల్పించడమే ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ఆర్డీఓ లు వెన్నెల శ్రీను, జి అనిల్ కుమార్, జిల్లాకు చెందిన తహసీల్దార్లు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


శుక్రవారం, ఆగస్టు 28, 2026


కింగ్ King Daily News Paper



# ఘనంగా 'ఎస్ఎస్ నాన్ వోవెన్ బ్యాగ్స్ ఇండస్ట్రీ' ప్రారంభోత్సవం..

• ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించిన టిడిపి రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్..







**నంద్యాల, ఆగస్టు 27 :** నంద్యాల పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు, బొగ్గులైన్ సమీపంలోని వివేకానంద కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఎస్ఎస్ నాన్ వోవెన్ బ్యాగ్స్ ఇండస్ట్రీ" గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి యూనిట్‌ను లాంఛనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ రహిత పర్యావరణహిత బ్యాగుల తయారీ ఎంతో అవసరమని, యువత ఇలాంటి సరికొత్త వ్యాపార రంగాల్లోకి అడుగుపెట్టి పారిశ్రామికవేత్తలుగా ఎదగడం అభినందనీయమని అన్నారు . అధునాతన నాణ్యతా ప్రమాణాలతో కూడిన క్యారీ బ్యాగులను ప్రజలకు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు షేక్ మన్సూర్, నూర్ అహ్మద్ కు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు (ప్రొప్రైటర్) షేక్ మన్సూర్ ,నూర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ కొండారెడ్డి, సంజీవ కుమార్, హిదాయత్, బషీర్, ఎస్ఎస్ ఫ్యామిలీ సభ్యులు, ఇతర నాయకులు, ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని యూనిట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

# టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల టైలర్స్ అసోసియేషన్ నాయకులు



**నంద్యాల, ఆగస్టు 27:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని నంద్యాల జిల్లా టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ ప్రతినిధులు ఫయాజ్ కి శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టైలరింగ్ వృత్తిదారుల సంక్షేమం, వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ చేతివృత్తుల వారి సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె. శేఖర్ (ప్రభు టైలర్), నంద్యాల టౌన్ అధ్యక్షులు కె. మగ్బూల్ బాషా , గౌరవాధ్యక్షులు పి. షఫీవుల్లా ఖాన్ , ట్రెజరర్ కె. అబ్దుల్లా తో పాటు జిల్లా టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు

# గోస్పాడు మండలం, దీబగుంట్ల గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా





**నంద్యాల, ఆగస్టు 27 :**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా గురువారం క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా గోస్పాడు మండలం, దీబగుంట్ల గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆరోగ్య కేంద్రం పనితీరు, అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అమలవుతున్న వివిధ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య శాఖ నిర్దేశించిన 21 కీలక పనితీరు సూచికల (21 Indicators) ఆధారంగా మెరుగైన ర్యాంకింగ్ సాధించేలా సిబ్బందితో సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. KPI కు సంబంధించి ూచీవీ లకు అవసరమైన శిక్షణ అందించి, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. లి ప్రస్తుతం ఉన్న పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో వసతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు కొనసాగుతున్న లినేపథ్యంలో, కొత్త భవనం పూర్తయ్యే వరకు రోగులకు వైద్య సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా స్థానిక సచివాలయ భవనంలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ప్రాథమిక చికిత్స కోసం ఒక బెడ్ అందుబాటులో ఉందని, పగటిపూట వచ్చే రోగులకు అవసరమైన చికిత్సతో పాటు అత్యవసర మందులు అందించి వైద్యుల పర్యవేక్షణలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. లినూతన భవనం పూర్తయిన అనంతరం 6 పడకల సదుపాయం అందుబాటులోకి రానుందని వెల్లడించారు. లిరోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయనీ వైద్య అధికారులు తెలిపారు. మందుల నిల్వ కోసం ప్రత్యేక గదిని కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం భవన వసతుల పరిమితుల కారణంగా ప్రసవ సేవలు మినహా మిగిలిన వైద్య సేవలను నిరంతరాయంగా అందిస్తున్నట్లు తెలిపారు. లిప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోవర్ధన్ రెడ్డితో పాటు PHC సిబ్బంది, ANMలు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# యాల్లూరు గ్రామంలో ఘనంగా 'డోర్ టు డోర్' (ఇంటింటికి తెలుగుదేశం) కార్యక్రమం

- పాల్గొన్న టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్





**గోస్పాడు/యాల్లూరు ఆగస్టు 27:** ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ అన్నారు.నంద్యాల నియోజకవర్గం, గోస్పాడు మండల పరిధిలోని యాల్లూరు గ్రామంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో 'డోర్ టు డోర్' (ఇంటింటికి తెలుగుదేశం) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్ హాజరయ్యారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ స్థానిక ప్రజలను నేరుగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ "తెలుగుదేశం ప్రభుత్వం మరియు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజా పక్షపాతిగా నిలబడి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు . ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు అన్ని సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ, ప్రతి అర్హుడికీ చేరేలా చూడటమే మా లక్ష్యం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ఈ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గౌరవ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారి ప్రత్యేక చొరవతో నంద్యాల నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు, సాగునీరు, తాగునీరు, సీసీ రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నామన్నారు . గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు . ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, సంక్షేమాన్ని చూసి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలంతా తెలుగుదేశం పార్టీ వెంటే నిలిచి అండగా ఉండాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యాల్లూరు టిడిపి నాయకులు కైప శివరాంరెడ్డి, ఈదుల రామేశ్వర్ రెడ్డి, బిక్కిం మోహన్ రెడ్డి, శేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , కైప జగన్నాథ్ రెడ్డి, నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, ఫణీంద్ర, మార్క కుమారు, మార్క శ్రీనివాస్ రెడ్డి, గోస్పాడు హుస్సేన్, దండే రంగ శేఖర్ రెడ్డి, మిద్దె ఉసేని, పుండరీ రెడ్డి, దీపక్ రెడ్డి, షబ్బీర్ , హిదయాతుల్లా మరియు గోస్పాడు మండల టీడీపీ ముఖ్య నాయకులు, యాల్లూరు గ్రామ ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైయస్ నగర్ అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం (చర్చిని) సందర్శించిన గోళ్ళ రాజేష్..

బరిగల్ గ్రౌండ్‌తోపాటు పేద,మధ్యతరగతి ప్రజలకోసం బాడీ ఫ్రీజర్ కొరకు లక్షరూపాయల ఆర్థిక సహకారం అందించారు.. గోళ్ళ రాజేష్

గోళ్ళ రాజేష్ కోసం పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన దైవ సేవకుల(పాస్టర్స్)

16 సంవత్సరాల కాలంలో చర్చీ కొరకు గోళ్ళ రాజేష్ ఒక్కరే ఆర్థిక సాయం అందించారన్న పాస్టర్స్..

**నంద్యాల, ఆగస్టు 27 :**పట్టణంలోని స్థానిక వైయస్ నగర్ నందు ఉన్న అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం (చర్చ్) ను సందర్శించాలని వై.యస్.ఆర్ నగర్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, మేడి బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ బుగ్గ రాముడు ఆహ్వానం మేరకు గోళ్ళ రాజేష్ వైఎస్ఆర్ నగర్ లోని చర్చ్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ బుగ్గ రాముడు తో పాటు పలువురు పాస్టర్లు చర్చికి ఉపయోగకరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకొని పేద, మధ్యతరగతి ప్రజల కోసం బాడీ ఫ్రీజర్ను,క్రిస్టియన్ల సమాధులు (బరిగెల్ గ్రౌండ్)చుట్టూ ఫెన్సింగ్ గోడ నిర్మాణం అవసరం ఉన్న విషయాన్ని గోళ్ళ రాజేష్ దృష్టికి తీసుకుని వచ్చారు. వెంటనే స్పందించిన గోళ్ళ రాజేష్ చర్చికి ఉపయోగకరమైన పరిస్థితుల దృష్ట్యా వెంటనే వారికి లక్ష రూపాయల ఆర్థిక సహకారాన్ని చెక్కు రూపంలో తాటికొండ బుగ్గ రాముడుతో పాటు పలువురు పాస్టర్ల సమక్షంలో వారికి అందించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ వైఎస్ఆర్ నగర్ లో నిర్మించిన అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం(చర్చ్) 16 సంవత్సరాల పూర్తి చేసుకున్నదని ఇంతవరకు ఈ చర్చి కొరకు ఎంతో వ్యయప్రయాసలు పడుతూ అందరూ కలిసి చర్చ్ నిర్వహించుకుంటున్నామని కేవలం గోళ్ళ రాజేష్ ఒక్కరు మాత్రమే ఈ చర్చికి ఆర్థిక సహకారం అందించిన మొట్టమొదటి వ్యక్తిఅని జీసస్ గోళ్ళ రాజేష్ కుటుంబాన్ని గోళ్ళ రాజేష్ యొక్క ఆరోగ్యంతో పాటు ఆ ప్రభువు ఆశీర్వాదం వల్ల సకల అష్టైశ్వర్యాలు కలగాలని గోళ్ళ రాజేష్ భవిష్యత్తులో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు,ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమ పథకాలు అందించాలని గోళ్ళ రాజేష్ గురించి పెద్ద సంఖ్యలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ బుగ్గ రాముడు మాట్లాడుతూ ఎన్నో చర్చిలు నిర్వహించడంలో



పాస్టర్లు ఎంతోమంది పేదరికంతో చాలా ఇబ్బంది పడుతూ చర్చిల నిర్వహణ కొనసాగిస్తున్నారని గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గంలో చేస్తున్న పలు సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్న సేవా సహాయ సహకారాలు కులమతాలకు అతీతంగా చేస్తున్న ఆర్థిక సహకారాలు అన్నిటిని గుర్తు చేస్తూ గోళ్ళ రాజేష్ ని అభినందించారు. గోళ్ళ రాజేష్ ని అభిషిక్తుని ఆశీర్వాద ప్రార్థన మందిరం(చర్చి)కి రావాలని చర్చి యొక్క అవసరాలను గుర్తించాలని అడిగిన వెంటనే పెద్ద మనసుతో గోళ్ళ రాజేష్ ఇక్కడికి వచ్చి చర్చికి అవసరం ఉన్న విషయం తెలుసుకొని వెంటనే లక్షరూపాయల ఆర్థిక సహకారం అందించినందుకు గోళ్ళ రాజేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు,అభినందనలు తెలిపారు. ఇలాంటి చర్చీలకు ఎంత సేవా,సహాయ, సహకారాలు అందించిన ప్రభు ఆశీర్వాదం వల్ల వారికి మరింత ప్రభు యొక్క ఆశీర్వచనాలు కలుగుతాయని తెలిపారు.గోళ్ళ రాజేష్ మాట్లాడుతూ తన జీవితంలో జరిగిన ఒక సంఘటన తనకు ఒకసారి ఒక ప్రమాదవశాత్తు తన చేతికి అయిన గాయం వల్ల మండుతున్న మంట వల్ల ఎంతో బాధ పడ్డ విషయాన్ని ఒక పాస్టర్ గమనించి వెంటనే ఒక వాటర్ బాటిల్ తీసుకొని ప్రార్థన చేసి తనకిచ్చి ఆ నీటిని తాగమన్నారు తాగిన తర్వాత పడుతున్న గాయం వల్ల కలుగుతున్న మంట క్రమంగా తగ్గిపోయిందని తన విషయంలో జరిగిన సంఘటన అద్భుతం అని తాను ఆశ్చర్య పోయిన విషయం గుర్తుచేసుకున్నారు. కులమతాలు తనకు లేవని అందరూ భగవంతుని బిడ్డలమే అని భవిష్యత్తులో ఇంకా ఎలాంటి సేవ,సహాయ,సహకారాలు చేయాలన్న దానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు తాటికొండ బుగ్గ రాముడు,డి పాల్ జోసఫ్ గారు బాలరాజు గారు కాలేబు, జయరాజు,ఇజ్రాయిల్, లాజర్,ప్రసాద్,ఆశీర్వాదం,సురేష్,విల్సన్,డేనియల్,జేమ్స్,ప్రకాష్,ఎ ామెల్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంజ్యూరీ లేఆఫ్స్ కు గుడ్ బై.. తెలుగబ్బాయ్ తోపాటు రీఎంట్రీకి సిద్ధమైన మరో ముగ్గురు..!



విదేశీ పరిస్థితుల్లో పేస్ బౌలింగ్ చేసే ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్ రెడ్డిపై భారత జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఫాస్ట్ బౌలింగ్‌పై స్టెఫన్ జోన్స్‌తో ప్రత్యేకంగా పని చేసిన అతడు గత ఏడాది గాయాలతో ఇబ్బంది పడ్డాడు. జూన్‌లో అఫ్ఘానిస్థాన్ వన్డే సిరీస్ సందర్భంగా ఎడమ తొడ కండరానికి గాయం కావడంతో ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనల వన్డే, టీ20 జట్ల నుంచి అతడిని తప్పించారు.ప్రస్తుతం నితీశ్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందుతున్నాడు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 23 ఏళ్ల నితీశ్ త్వరలోనే తిరిగి మైదానంలోకి వచ్చే అవకాశం ఉంది. గతంలో సైడ్ స్ట్రెయిన్, మోకాలి గాయం, మెడ కండరాల సమస్యలు కూడా అతడిని ఇబ్బంది పెట్టాయి. 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో అతడు కీలక ఆటగాడిగా భావిస్తున్నారు.హర్షిత్ రాణా పరిస్థితి ఎలా ఉంది?హర్షిత్ రాణా కూడా బెంగళూరులోనే కోలుకుంటున్నాడు. తీవ్రమైన మోకాలి గాయం కారణంగా 2026 టీ20 ప్రపంచకప్, ఐపీఎల్‌కు దూరమైన అతడు ఐర్లాండ్ పర్యటనలో టీ20 జట్టులోకి తిరిగి వచ్చాడు. అక్కడ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో మరోసారి వెనుదిరగాల్సి వచ్చింది.ఎక్కువమంది చదివినది: ఫ్లూ 2027: ముగిసిన హార్దిక్ ట్రేడింగ్.. బలిపశువుల్లా ఆ ఇద్దరు.. ఏ టీంలో చేరనున్నాడంటే?రికవరీ సమయంలో బరువు పెరగడం వల్ల అతడికి గ్రేడ్-1 హ్యామ్‌స్ట్రింగ్ గాయం అయినట్లు సమాచారం. ప్రస్తుతం అతడి రికవరీ కూడా సానుకూలంగా సాగుతోందని తెలుస్తోంది. న్యూజిలాండ్ భారత్ పర్యటనలో జనవరిలో హర్షిత్ అర్ధశతకం సాధించడంతో పాటు, ఐర్లాండ్‌పై తిరిగి వచ్చిన మ్యాచ్‌లో వేగంగా 21 పరుగులు చేశాడుగాయాలతో దూరమైన మరికొందరు..

2026లో పలువురు భారత ఆటగాళ్లు గాయాల కారణంగా జట్టుకు దూరమయ్యారు. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, వరుణ్ చక్రవర్తి, ఆకాశ్ దీప్, రియాన్ పరాగ్ కూడా గాయాల జాబితాలో ఉన్నారు.ఎక్కువమంది చదివినది: ఎవర్రా

# సెమీఫైనల్స్‌లో తలపడే 4 జట్లు ఇవే.. దేశవాళీలో ఇక రచ్చరచ్చే..!




బెంగళూరులో జరుగుతున్న దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ రౌండ్ ముగిసింది. ఈ రౌండ్‌లోని మొదటి మ్యాచ్‌లో, ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ జట్టు ఒక ఇన్నింగ్స్ 210 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్ జట్టు వెస్ట్ జోన్ జట్టును 52 పరుగుల తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించింది. దీంతో ఈస్ట్ జోన్, నార్త్ జోన్ జట్లు రెండూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయిమొదటి సెమీ-ఫైనల్ మ్యాచ్..దులీప్ ట్రోఫీ మొదటి సెమీ-ఫైనల్ ఇప్పుడు ఆగస్టు 30న జరగనుంది. ఇందులో సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్ దీజజ× సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోని గ్రౌండ్ 1లో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. సెంట్రల్ జోన్ జట్టుకు రజత్ పాటిదార్ నాయకత్వం వహించగా, ఈస్ట్ జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ సారథ్యం వహించనున్నారు.రెండవ సెమీ-ఫైనల్ మ్యాచ్..అదేవిధంగా, రెండవ సెమీ-ఫైనల్ మ్యాచ్ సౌత్ జోన్, నార్త్ జోన్ జట్ల మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ కూడా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్ 2లో ఆగస్టు 30న ప్రారంభమవుతుంది. సౌత్ జోన్ జట్టుకు తిలక్ వర్మ, నార్త్ జోన్ జట్టుకు కన్హయ్య వాధవన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఈ మ్యాచ్ కూడా ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది.సెంట్రల్ జోన్ జట్టు: రజత్ పాటిదార్ (కెప్టెన్), రింకు సింగ్ (వైస్ కెప్టెన్), ఆర్యన్ జువల్ (వికెట్ కీపర్), శరాన్‌షా జైన్, అమన్ మొఖడే, కునాల్ చండేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, ఆయుష్ పాండే, యశ్ సింగ్ రాథోడ్, యశ్ రాథోడ్, పర్వ్ రాథోడ్, పర్వ్ రాథోడ్స్టాండ్‌బై ఆటగాళ్లు: అమన్‌దీప్ ఖరే, మయాంక్ మిశ్రా, సౌరభ్ రావత్, భార్గవ్ మెరాయ్, కునాల్ యాదవ్, కుమార్ కార్తికేయ.ఈస్ట్ జోన్ జట్టు: అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ ఘరామి, మహ్మద్ షమీ, ముఖేష్ కుమార్, షాబాజ్ అహ్మద్, సూరజ్ జైస్వాల్, ఇషాన్ కిషన్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), విరాట్ సింగ్, కుమార్ కుషాగ్రా, శిఖర్ మోహన్, సుబ్రాన్షు సేనాపతి, అభిజిత్ ద రోకర్, అనీషుర్ ద రోకర్.స్టాండ్‌బై ఆటగాళ్లు: ఆయుష్ లోహరుక, శ్రీదమ్ పాల్, సంబిత్ ఎస్ బరల్, శరణ్‌దీప్ సింగ్, స్వస్తిక్ సమల్.సౌత్ జోన్ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్, అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె. హిమతేజ, స్మరణ్ రవిచంద్రన్, ఎన్. జగదీషన్, కరుణ్ నాయర్, టి. త్యాగరాజన్, శ్రేయాస్ గోపాల్, సాయి తేజ, టి. విజయ్, విద్వాత్ కావేరప్ప, అమన్ ఖాన్.నార్త్ జోన్ జట్టు: కన్హయ్య వాధావన్ (కెప్టెన్), ఆయుష్ బదోని (వైస్ కెప్టెన్), సనత్ సాంగ్వాన్, కమ్రాన్ ఇక్బాల్, యశ్ ధుల్, ఆయుష్ దోసెజా, అబ్దుల్ సమద్, నిషాంత్ సింధు, అర్జున్ శర్మ,

# రిషబ్ పంత్‌కు ప్రమోషన్.. బుమ్రా, జైస్వాల్‌లకు డిమోషన్..!



టీమ్ ఇండియా ఆటగాడు రిషబ్ పంత్ ఐసీసీ టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకాడు. శ్రీలంకతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న కీపర్-బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్, ర్యాంకింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో సమంగా నిలిచి, ఇప్పుడు టాప్ 10లో చేరాడు.ఈ టెస్ట్ సిరీస్‌కు ముందు టాప్ 10లో కూడా లేని రిషబ్ పంత్, ఇప్పుడు 711 రేటింగ్ పాయింట్లతో ఆరు స్థానాలు ఎగబాకి ఏడవ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో, శుభ్‌మన్ గిల్‌కు కూడా 711 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. దీని ప్రకారం, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం 7వ స్థానంలో ఉన్నారు.ఈ టెస్ట్ సిరీస్‌కు ముందు టాప్ 10లో కూడా లేని రిషబ్ పంత్, ఇప్పుడు 711 రేటింగ్ పాయింట్లతో ఆరు స్థానాలు ఎగబాకి ఏడవ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో, శుభ్‌మన్ గిల్‌కు కూడా 711 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. దీని ప్రకారం, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం 7వ స్థానంలో ఉన్నారు.గాలెలో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో రిషబ్ పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 39 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 66 పరుగులు సాధించాడు. ఫలితంగా, పంత్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకాడు. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడటంలో విఫలమయ్యాడు. గిల్ తొలి ఇన్నింగ్స్‌లో 16 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం ఎనిమిది పరుగులు మాత్రమే చేయగలిగాడు.గాలెలో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో రిషబ్ పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 39 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 66 పరుగులు సాధించాడు. ఫలితంగా, పంత్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకాడు. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడటంలో విఫలమయ్యాడు. గిల్ తొలి ఇన్నింగ్స్‌లో 16 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం ఎనిమిది పరుగులు మాత్రమే చేయగలిగాడు.గాలే టెస్టులో ఆశించిన స్థాయిలో రాణించని యశ్వహి జైస్వాల్ టాప్ 10 నుండి బయటకు పడిపోయాడు. రెండు స్థానాలు దిగజారిన జైస్వాల్, 701 రేటింగ్ పాయింట్లతో 11వ స్థానానికి పడిపోయాడు. భారత్, శ్రీలంక మధ్య జరిగిన రెండో టెస్టులో చేసిన పరుగులను ఈ ర్యాంకింగ్‌లో పరిగణనలోకి తీసుకోలేదు. దీని కారణంగా ర్యాంకింగ్ జాబితాలో మార్పులు జరిగాయి.

గాలే టెస్టులో ఆశించిన స్థాయిలో రాణించని యశ్వహి జైస్వాల్ టాప్ 10 నుండి బయటకు పడిపోయాడు. రెండు స్థానాలు దిగజారిన జైస్వాల్, 701 రేటింగ్ పాయింట్లతో 11వ స్థానానికి పడిపోయాడు. భారత్, శ్రీలంక మధ్య జరిగిన రెండో టెస్టులో చేసిన పరుగులను ఈ ర్యాంకింగ్‌లో పరిగణనలోకి తీసుకోలేదు. దీని కారణంగా ర్యాంకింగ్ జాబితాలో మార్పులు జరిగాయి.ఈలోగా, బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని కోల్పోగా, ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బుమ్రా మినహా, టాప్ 10లో మరే ఇతర భారత బౌలర్ లేడు. టాప్ 20లో, మహమ్మద్ సిరాజ్ నాలుగు స్థానాలు దిగజారి 18వ స్థానానికి, రవీంద్ర జడేజా మూడు స్థానాలు దిగజారి 19వ స్థానానికి పడిపోయారు.ఈలోగా, బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని కోల్పోగా, ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బుమ్రా

# ఫుడ్ బిజినెస్ స్టార్ట్ చేయాలా? కేంద్రం నుంచి 35% సబ్సిడీ.



మీరు మీ సొంత వ్యాపారాన్ని, ముఖ్యంగా ఆహార ప్రాసెసింగ్‌కు సంబంధించిన వ్యాపారాన్ని ప్రారంభించాలని కలలు కంటున్నట్లయితే, ఒక ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ పథకం మీకు చాలా సహాయకరంగా ఉంటుంది. అయితే మీరు కొత్తగా ఫుడ్ బిజినెస్ స్టార్ట్ చేయాలనుకుంటున్నారా? లేదా ఉన్న బిజినెస్‌ను మరింత విస్తరించాలనుకుంటున్నారా? ఇది మీకు బెస్ట్ ఆప్షన్. మీావీజు పథకం కింద ఫుడ్ బిజినెస్, కేటరింగ్ లేదా ప్రాసెసింగ్ రంగంలో ఉన్నవారికి రూ. 10 లక్షల వరకు సబ్సిడీ లోన్స్ లభిస్తున్నాయి. అంతేకాదు, ఇందులో ఏకంగా 35% వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది.ఈ లోన్ పొందడానికి సరైన బిజినెస్ ప్లాన్, +ూ, ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేసుకుంటే ప్రాసెస్ చాలా ఈజీ అవుతుంది. పన్నులు తగ్గించుకోవడమే కాకుండా ఆర్థికంగా స్థిరపడటానికి ఇది ఒక గొప్ప అవకాశం.

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ూవీఖీవీజు పథకం ఫుడ్ బిజినెస్ చేసేవారికి భారీ ఆర్థిక సబ్సిడీ లభిస్తోంది. కొత్తగా ఫుడ్ బిజినెస్ ప్రారంభించాలనుకునే వారికి, ఇప్పటికే ఉన్న వ్యాపారాన్ని విస్తరించుకోవాలనుకునే వారికి ఈ స్కీమ్ ఎంతగానో ఉపయోగపడుతుంది.అర్హతలు, సబ్సిడీ వివరాలుప్రాజెక్ట్ ఖర్చుపై 35% వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉంటుంది. గరిష్టంగా రూ. 10 లక్షల వరకు క్రెడిట్ లింక్డ్ క్యాపిటల్ సబ్సిడీ ఉంటుందని తెలుస్తోంది.. దరఖాస్తుదారుడు ప్రాజెక్ట్ విలువలో కేవలం 10% మాత్రమే సొంతంగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మిగిలిన 90% మొత్తాన్ని బ్యాంకులు రుణంగా మంజూరు చేస్తాయి. 18 ఏళ్లు పైబడిన వ్యక్తులు, కొత్త ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టేవారు. మహిళా స్వయం సహాయక బృందాలు (ూ఩+ం), రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఖీూం) ఈ సబ్సిడీకి అర్హులు. మీరు ఏదైనా ఫుడ్ బిజినెస్ చేయాలనుకునేవారికి వివిధ రకాల ఫుడ్ ప్రాసెస్ యూనిట్లు, పికిల్స్, బేకరీలు, మిల్లెట్స్ అండ్ స్నాక్స్ తయారీ, మసాలా పొడుల తయారీ, డెయిరీ ఉత్పత్తులు, పండ్ల రసాలు, ఇతర ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఇలా ఎన్నో ఉన్నాయి.

ఈ పథకం ప్రయోజనాలను ఎవరు పొందవచ్చు:

ఇప్పటికే చిన్న ఆహార ప్రాసెసింగ్ వ్యాపారాన్ని నిర్వహిస్తూ, దానిని విస్తరించాలనుకుంటున్న వ్యక్తిగత పారిశ్రామికవేత్తలకు, అలాగే ప్రభుత్వ 'ఒక జిల్లా, ఒక ఉత్పత్తి' చొరవ కింద తమ సొంత వ్యాపారాలను ప్రారంభించాలనుకుంటున్న కొత్త పారిశ్రామికవేత్తలకు ఈ పథకం అందుబాటులో ఉంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఖీూలు), స్వయం సహాయక బృందాలు (ూ఩+లు), సహకార సంఘాలు కూడా ఈ ఆర్థిక ప్రయోజనానికి అర్హులు.దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలు:

1. ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి, దరఖాస్తుదారులు అధికారిక ూవీఖీవీజు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 2. దరఖాస్తు చేసేటప్పుడు మీరు మీ వ్యాపారం పూర్తి ప్రాజెక్ట్ నివేదిక

# తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే?



బంగారం కొనే వారకి గత కొద్ది రోజులుగా పసిడి ధరలు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా గత వారం రోజుల్లోనే పసిడి ధరలు భారీ పెరిగి రికార్డ్ స్థాయికి చేరుకున్నాయి. కేవలం ఆగస్టు 15 నుండి ఆగస్టు 22 మధ్య దేశీయ మార్కెట్లలో 10 గ్రాముల బంగారంపై సుమారు రూ. 3,500 నుండి రూ. 4,500 వరకు పెరుగుదల నమోదైంది. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువ మారకం కారణంగా బంగారం ధరల్లో ఈ భారీ మార్పులు చోటుచేసుకున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.అయితే నిన్నటితో పోల్చుకుంటే దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెద్దగా మార్పు ఏమిలేదు.. ప్రస్తుతం 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,490గా ఉండగా.. నిన్న ఈ ధర రూ. 1,60,480గా ఉంది. 22 క్యారట్ల బంగారం ధర రూ.1,47,110 ఉండగా నిన్న ఈ ధర రూ1,47, 100గా ఉంది. ఇక 18 క్యారట్ల బంగార ధర రూ.1,20,370 వద్ద కొనసాగుతుంది. ఇక వెండి సైతం బంగారం బాటలోనే నడుస్తోంది. దేశీయ మార్కెట్‌లో నిన్న కేజీ వెండి ధర రూ.2,60,000గా ఉన్న వెండి ధర రూ.100 పెరిగి ప్రస్తుతం 2,60,100 ట్రేడవుతుంది.ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు..హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం10 గ్రాముల ధర రూ.1,60,490, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,47,110 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,65,100 ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,60,490, 22 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,47,110 ఉంది. వెండి కిలో ధర రూ.2,60,100 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,60,640, 22 క్యారెట్ల ధర రూ.1,44,260 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,60,100 ఉంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,60,490, 22 క్యారెట్ల ధర రూ.1,47,110 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,60,100 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,60,490, 22 క్యారెట్ల ధర రూ.1,47,110 ఉంది. వెండి కిలో ధర రూ.2,65,100 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,60,490, 22 క్యారెట్ల ధర రూ.1,47,110 ఉంది. వెండి కిలో ధర రూ.2,60,100 లుగా ఉంది.

అయితే బంగారం, వెండి ధరలు అన్ని ప్రాంతాల్లో ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు.. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. కాబట్టి మీరు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.


# మాసం ప్రియులకు గుడ్‌న్యూస్.. భారీగా తగ్గిన చికెన్ ధర.. ఎంతో తెలిస్తే ఎగబడి కొంటారు..!




ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు భగ్గుమన్నాయి. కానీ గత కొన్ని రోజులుగా క్రమంగా దిగి వస్తున్నాయి. ఈ శ్రావణ మాసంలో చాలా మంది పూజలు, వ్రతాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల కారణంగా పలువురు మాంసాహారానికి దూరంగా ఉంటారు. దీంతో చికెన్కు డిమాండ్ తగ్గి.. రిటైల్ మార్కెట్?లో ధరలు దిగివచ్చాయి. ముఖ్యంగా వారాంతాల్లో కూడా కొనుగోళ్లు తగ్గడం ధరలపై మరింత ప్రభావం చూపుతోంది.

డిమాండ్ తగ్గినా కోళ్ల సరఫరా కొనసాగుతుండటంతో మార్కెట్లో ధరలపై ఒత్తిడి ఏర్పడుతోంది. ఫీడ్ ధరలు, రవాణా ఖర్చులు, ఉత్పత్తి వ్యయం వంటి అంశాలతోపాటు ప్రస్తుతం డిమాండ్ సరఫరా సమతుల్యత కూడా చికెన్ ధరలను ప్రభావితం చేస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్ మరింత తగ్గితే ధరలు మరింతగా తగ్గే అవకాశాలు ఉన్నాయని కూడా చెబుతున్నారు. హైబ్రిడ్ సీలింగ్ ఫ్యాన్ గురించి మీకు తెలుసా? ధర ఎంతంటే..శ్రావణ మాసం ముగిసిన తర్వాత మాంసాహార వినియోగం సాధారణ స్థాయికి చేరితే చికెన్?కు డిమాండ్ మళ్లీ పెరిగే అవకాశం ఉంది. దీంతో ధరలు కూడా తిరిగి పుంజుకునే అవకాశముందని పౌల్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం మాత్రం ధరలు భారీగా తగ్గడం చికెన్ ప్రియులకు కొంత ఊరటనిచ్చాయనే చెప్పాలిప్రస్తుతం శ్రావన మాసం కారణంగా చికెన్‌తో పాటు గుడ్ల ధరలు కూడా భారీగానే దిగి వస్తున్నాయి. తెలంగాణలోని హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో నెల ప్రారంభంలో కిలో చికెన్ ధర రూ.320–350 వరకు పలుకగా, ఒక దశలో కిలో 400 రూపాయలకు కూడా వెళ్లింది. ప్రస్తుతం రూ.200కి దిగొచ్చినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో అయితే కిలో చికెన్ ధర రూ.230 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు.భారీగా పడిపోయిన గుడ్ల ధరలుఇక చికెన్ తగ్గంతో పాటు గుడ్డు ధర కూడా భారీగా పడిపోయింది. ఒక గుడ్డ ధర 5 రూపాయలు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 6 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఏదీ ఏమైన చికెన్‌తో పాటు గుడ్డు ధర పడిపోవడం కొనుగోలుదారులకు ఊరటనిస్తున్నాయి.

## నేను రాసింది ఒకటి.. తీసింది ఒకటి.. మీరు చూసింది ఇంకొకటి..





డ్యాడీ ఈజ్ హోమ్.. అంటూ టాక్సిక్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఊహించని విధంగా డివైడ్ టాక్ సొంతం చేసుకుంది. సినిమా టైటిల్ అనౌన్స్ చేసిన దగ్గర నుంచి పోస్టర్స్, సాంగ్స్, గ్లింప్స్, టీజర్, ట్రైలర్, ప్రమోషన్స్ అంటూ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి.. తీరా సినిమా రిలీజ్ అయిన తర్వాత ఇదేంటీ మనం అనుకున్నది ఇది కాదే.. సినిమా ఇలా ఉందేంటి అంటూ సినిమా చూసొస్తున్న ఆడియన్స్ ఫీల్ అవుతున్నారు. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్టైన్మెంట్ సినిమా కావడంతో ఆడియన్స్ లో ఓ రేంజ్ లో అంచనాలు పెరిగిపోయాయి. ఫైట్లు, యాక్షన్స్ సీన్స్ కూడా అదే రేంజ్ లో ఉన్నాయి. కానీ సినిమా ఎక్కడో తేడా కొట్టిందే అంటున్నారు ఆడియన్స్.సినిమా డివైడ్ టాక్ వస్తున్న నేపథ్యంలో దర్శకురాలు గీతూ మోహన్ దాస్ కు సంబందించిన ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ వీడియోలో ఆమె మాట్లాడుతూ.. నేను రాసింది ఒకటి, తీసింది మరొకటి, ఎడిటింగ్ చేసింది ఇంకొకటి..మొత్తానికి సినిమా బయటకు వచ్చింది. నేను చాలా హ్యాపీ అంటూ ఆమె చెప్పుకొచ్చింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ చక్కర్లు కొడుతుంది. అయితే ఈ వీడియో ఇప్పటిది కాదు పాతది అని కొందరు అంటున్నారు. మరికొందరు ఓహో డైరెక్టర్ కు క్లారిటీ ఉందన్నమాట అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు.ఇక టాక్ సినిమా తొలి రోజే దేశవ్యాప్తంగా భారీగా కలెక్షన్స్ సొంతం చేసుకుంది. సినిమాకు ముందు నుంచి భారీ హైప్ ఉండటంతో బుకింగ్స్ బాగానే జరిగింది. దాంతో ఫస్ట్ డే కలెక్షన్స్ బాగానే రాబట్టింది ఈ సినిమా. మొదటి రోజు సినిమాకు కలెక్షన్స్ వర్షం కురిపించింది. .

## జైలర్ 2 సాంగ్ ఇరగదీశారు.




సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, బ్లాక్‌బస్టర్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ చిత్రం 'జైలర్ 2'. 2023లో విడుదలై భారీ విజయాన్ని అందుకున్న జైలర్ చిత్రానికి సీక్వెల్ ఇది. అందుకే మొదటి నుంచి ఈ మూవీకి సంబంధించిన అప్డేట్స్ క్షణాల్లో వైరలవుతున్నాయి. అయితే ఈ సినిమా నుంచి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫస్ట్ సింగిల్ 'అలా బోలేలో' (ూాశ్రీఖ ) పాటను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వీయ దర్శకత్వంలో, తనదైన మార్క్ మాస్ బీట్లతో ఈ పాటను స్వరపరిచి ఆలపించారు. ఈ పాటలో నటి పూర్ణ (షామ్నా కాసిమ్) సాంప్రదాయ కేరళ చీరకట్టులో ఎంతో గ్లామరస్‌గా కనిపిస్తూ, అదిరిపోయే మాస్ డ్యాన్స్ మూవ్స్‌తో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. పూర్ణ డ్యాన్స్‌కు తోడు సూపర్ స్టార్ రజనీకాంత్ తనదైన స్వాగ్, స్టైలిష్ ప్రెజెన్స్‌తో ఈ పాటకు మరింత ఊపు తెచ్చారు.మొదటి భాగంలో తమన్నా నటించిన 'నువ్వు కావాలయ్యా' పాట పాన్-ఇండియా స్థాయిలో ఎంతటి ట్రెండ్ సెట్ చేసిందో అందరికీ తెలిసిందే. అదే తరహాలో ఓనం పండుగ కానుకగా మలయాళీ టచ్ ఇస్తూ ఈ 'అలా బోలేలో' పాటను రూపొందించారు. శ్రీనివాస మౌళి/అరుణ్‌రాజా కామరాజ్ అందించిన సాహిత్యం, అనిరుధ్ హై ఎనర్జిటిక్ వాయిస్ ఈ పాటను చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టేలా ఉన్నాయి.సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో రమ్యకృష్ణ, యోగి బాబు, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫస్ట్ సింగిల్‌తోనే 'జైలర్ 2' ప్రమోషన్లను మేకర్స్ గ్రాండ్‌గా షురూ చేశారు.

## ఆ హీరో అంటే నాకు పిచ్చి.. ఒక్కసారైనా కలవాలి.



బిగ్ బాస్ గేమ్ షో పేరు తెచ్చుకున్న ముద్దుగుమ్మల్లో దివి ఒకరు. కెరీర్ బిగినింగ్ లో చిన్న చిన్న పాత్రలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న దివి. ఆ తర్వాత ఈ అందాల భామ పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించింది. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన మహర్షి సినిమాలో చిన్న పాత్రలో కనిపించింది. అలాగే మరో రెండు మూడు సినిమాల్లోనూ నటించింది. ఇదే క్రేజ్ తో బిగ్ బాస్ గేమ్ షోలోకి అడుగుపెట్టింది. బిగ్ బాస్ లో తన గేమ్ తో పాటు అందంతోనూ ఆకట్టుకుంది ఈ చిన్నది. ఇక బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ బ్యూటీకి అంతగా ఆఫర్స్ రాలేదు. బిగ్ బాస్ సమయంలో మెగాస్టార్ చిరంజీవి దివికి సినిమాలో ఛాన్స్ ఇస్తా అని మాట ఇచ్చారు.

జీుఎుతీఖుర్ష్ట చీుతీవంష్ట: మొదట్లో రూ.500 ఇచ్చారు.. ఇప్పుడు ఒకొక్క ఎపిసోడ్‌కు నాకు ఇచ్చేది ఎంతంటే

ఆతర్వాత మెగాస్టార్ చిరంజీవి నటించిన గాడ్ ఫాదర్ సినిమాలో కీలక పాత్రలో నటించింది ఈ చిన్నది. ఆ తర్వాత పెద్దగా కనిపించలేదు. ప్రైవేట్ ఆల్బమ్స్ తో ఆకట్టుకుంటుంది. అలాగే మొన్నామధ్య హీరోయిన్ గానూ ఓ సినిమా చేసింది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను కవ్విస్తుంది దివి. కాగా దివి ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

రూ. 65కోట్లు పెడితే.. రూ.10 కోట్లు కూడా రాలేదు.. డిజాస్టర్ దెబ్బకు హీరో రూపాయి కూడా తీసుకోలేదు

గతంలో ఒక ఇంటర్వ్యూలో దివి మాట్లాడుతూ.. మిర్చిసినిమా చూసినప్పటి నుంచి ప్రభాస్‌కు తాను వీరాభిమానిగా మారానని, ఆ తర్వాత బాహుబలి చిత్రాలతో ఆయన పట్ల తన అభిమానం మరింత పెరిగిందని దివి చెప్పుకొచ్చింది. ప్రభాస్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ పంపినట్లు గుర్తు చేసుకుంది దివి. చాలా మంది అభిమానుల్లాగే ఒక్కసారి ప్రభాస్‌ను చూడాలని, కలవాలనిఉందని, ఆయనతో ఓ డిసెంట్ కాఫీ డేట్‌కు వెళ్లాలని దివి చెప్పుకొచ్చింది. ప్రభాస్ ఇంటికి వచ్చిన అతిథులను చాలా ఆప్యాయంగా చూసుకుంటారని, ఆయన ఆతిథ్యం అద్భుతంగా ఉంటుందని తాను విన్నానని తెలిపింది. తన డ్రీమ్ డేట్ ఒక కూల్ కాఫీతో మొదలవ్వాలని, ప్రభాస్‌తో కూర్చుని మనసువిప్పి

## ఇన్ స్టా రీల్స్ చూసి సినిమా ఛాన్స్



"ఇరుముడి" చిత్రంలో మనమ్మ పాత్రతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న బాలనటి నక్షత్ర, తన సినీ ప్రయాణం, సెట్‌లో ఎదురైన అనుభవాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ సినిమాలో నక్షత్ర పోషించిన మనమ్మ పాత్ర ఎంతగానో ప్రాణం పోసిందని, ఆమె లేకపోతే సినిమా ఇంత బాగా ఉండేది కాదని ఇంటర్వ్యూ ప్రారంభమైంది. నక్షత్ర ప్రస్తుతం తన విజయాన్ని ఆస్వాదిస్తున్నానని, తెలుగు ప్రేక్షకులనుండి లభించిన అపారమైన ప్రేమకు సంతోషంగా ఉన్నానని తెలిపారు. ఆమె చిరునవ్వు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుందని, సినిమాలో ఆమె నవ్వు తమకు చాలని వ్యాఖ్యాత అన్నారు. "ఇరుముడి" అవకాశం తనను ఎలా వరించిందో నక్షత్ర వివరించారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తుండగా, దర్శకుడు ఆమె తల్లిని సంప్రదించారు. హైదరాబాద్‌లో ఆడిషన్ ఇచ్చి, మనమ్మ పాత్రకు ఎంపికయ్యారు. సినిమాలో ప్రారంభ సన్నివేశంలోని సంభాషణకు ఆడిషన్ ఇచ్చానని తెలిపారు.రవితేజ గారితో కలిసి పనిచేసిన అనుభవం గురించి మాట్లాడుతూ, ఆయన, దర్శకుడు, మరియు తెరపై తన తల్లిగా నటించిన ప్రియ మ్యామ్ ఎంతో సహకరించారని నక్షత్ర చెప్పారు. తనను నిజమైన కూతురిలా చూసుకున్నారని, వారితో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె అన్నారు. తెరపై తండ్రీకూతుళ్ల మధ్య ఉన్న బలమైన బంధం గురించి మాట్లాడుతూ, నిజ జీవితంలో తన తండ్రితోనూ అదే ప్రేమ ఉందని, అయితే తెరపై చూపినంత బలమైన అనుబంధం కాదని వివరించారు. తెలుగు భాషతో మొదట్లో ఎదురైన సవాళ్లను నక్షత్ర ప్రస్తావించారు. తనకు చిన్న చిన్న తెలుగు పదాలు అర్థమవుతాయని, కానీ మాట్లాడటం కష్టమని అన్నారు. సినిమా కోసం తన సంభాషణలకు డబ్బింగ్ తానే చెప్పుకున్నానని, ఒక ట్రాన్స్‌లేటర్ సహాయంతో మలయాళంలోకి అనువదించిన డైలాగులను చదివి నేర్చుకున్నానని తెలిపారు. మొదట్లో పెద్ద పెద్ద డైలాగులు చూసి ఆందోళన చెందానని, కానీ సెట్‌లో అందరి మద్దతుతో ధైర్యం వచ్చిందని చెప్పారు. కొన్ని తెలుగు పదాలు, ముఖ్యంగా "నాన్న", "అమ్మ" వంటివి మలయాళంలో కూడా ఒకేలా ఉన్నాయని నక్షత్ర గుర్తించారు."ఇరుముడి" చిత్రంలోని తనకిష్టమైన సన్నివేశం గురించి అడగగా, నీటిలో వస్తువులు వేసే సన్నివేశం తనకు బాగా నచ్చిందని, నీటిలో ఆడటం అంటే తనకిష్టమని నక్షత్ర తెలిపారు. సినిమాలోని ప్రతి సన్నివేశం తనకెంతో ఇష్టమని, సినిమా చూసినప్పుడు ఎంతో ఏడ్చానని గుర్తు చేసుకున్నారు. ప్రేక్షకులు కూడా సినిమా చూసేటప్పుడు టిష్యూలు వెంటపెట్టుకెళ్లమని చెప్పారని సరదాగా అన్నారు. తెలుగు చిత్రాల గురించి తనకు పెద్దగా అవగాహన లేదని, తాను మలయాళ చిత్రాలను మాత్రమే చూస్తానని చెప్పారు. రవితేజ గారు సెట్‌లో తనతో ఇంగ్లీష్ మాట్లాడేవారని, కొన్ని తెలుగు పదాలను నేర్పించి సహాయం చేశారని నక్షత్ర పేర్కొన్నారు. ప్రస్తుతం తాను ఏడవ తరగతి చదువుతున్నానని, తన తదుపరి చిత్రం "డాడ్" విడుదల కానుందని చెప్పారు. తన తల్లితో పాటు మేనమామ కూడా తన వెంట షూటింగ్, ఇంటర్వ్యూలకు వస్తారని తెలిపారు. ఇక ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం 'ఇరుముడి' చిత్రంలో నటించినందుకు బేబీ నక్షత్రకు సుమారు ?10 లక్షల పారితోషికం అందజేసినట్లు తెలుస్తోంది. తొలి తెలుగు సినిమాతోనే ఇంతటి ప్రాధాన్యత ఉన్న పాత్ర దక్కడం మరియు ఆ పాత్రకు తగినట్టుగా మంచి రెమ్యూనరేషన్ పొందడం విశేషం

## కృతి సనన్ యాడ్ వివాదం.. కంగనాకు కౌంటరిచ్చిన హీరోయిన్.



కంగనా మాట్లాడితే వివాదం మొదలవుతుంది. కానీ ఆ వివాదం ఎక్కడ ఆగుతుందో మాత్రం ఎవరికీ తెలియదు. బాలీవుడ్‌లో కంగనా రనౌత్ పేరు చెబితే సినిమాల కంటే ముందు ఆమె మాటలు గుర్తొస్తాయి. ఏ విషయం మీదైనా నేరుగా మాట్లాడటం. పెద్ద స్టార్లను ప్రశ్నించడం. సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని బలంగా చెప్పడం. ఇదే ఆమె స్టైల్. తాజాగా కృతి సనన్ రాఖీ యాడ్‌పై చేసిన వ్యాఖ్యలతో మరోసారి ఇదే చర్చ మొదలైంది. జ్యువెలరీ బ్రాండ్ +×వాా కోసం కృతి సనన్ చేసిన రక్షాబంధన్ ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. రాఖీ వంటి పండుగకు ఆ లుక్ సరిపోదని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. కంగనా కూడా స్పందించారు. ఆ దుస్తులతో సోదరుడికి రాఖీ కట్టడం ఎందుకని ప్రశ్నించారు. యాడ్‌ను ఇంటెన్షనల్‌గా క్రీపీగా అభివర్ణించారు.ఇక్కడితో విషయం ముగిసిపోలేదు.. కృతి సనన్ కూడా గట్టిగానే స్పందించారు. ఒక మహిళ ఏం వేసుకోవాలనే విషయాన్ని ఇతరులు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. పండుగ అంటే దుస్తులు కాదు. మనసులో ఉన్న భావం, సంప్రదాయంపై గౌరవం అని చెప్పారు. ఆమె మాటల్లో ప్రధానంగా వ్యక్తిగత స్వేచ్ఛ కనిపించింది. అంటే ఇక్కడ రెండు వాదనలు ఎదురెదురుగా వచ్చాయి. పండుగకు తగ్గట్టు ఉండాలన్న వాదన ఒక వైపు.. మహిళ దుస్తులు ఆమె ఇష్టమన్న వాదన మరో వైపు. ఇంతలో ఈ గొడవలోకి రాజకీయ రంగు వచ్చింది.

## త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పిన మరో గొప్ప జీవిత పాఠం..



మాటల మాంత్రికుడు, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఆయన సినిమాలతో పాటు అందులో ఆయన చెప్పిన పదునైన మాటలు, డైలాగులు చాలా బాగా గుర్తుండిపోతాయి. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్లలోనూ త్రివిక్రమ్ చెప్పే మాటలు, ఇచ్చే స్పీచులు ఎంతో ఆసక్తికరంగా ఉండిపోతాయి. అలా తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు మాటల మాంత్రికుడు. ఈ సందర్భంగా ఆయన ఫెయిల్యూర్స్ ను ఎలా తీసుకోవాలో సూచిస్తూ ఓ అద్భుతమైన ప్రసంగం ఇచ్చారు. ఈ సందర్భంగా తన కెరీర్ లో ఫ్లాప్ గా నిలిచిన అజ్ఞాత వాసి సినిమాను ఉదహరిస్తూ ఆ సమయంలో తనకు తన భార్య, పిల్లల మధ్య జరిగిన సంభాషణను పంచుకున్నారు.

ఫెయిల్యూర్‌ని దాచి పెట్టడం వల్ల మనసు ఎక్కువ బరువుగా అనిపిస్తుంది. నేను ఇల్లు కట్టుకుంటోన్న సమయంలోనే 'అజ్ఞాతవాసి' సినిమాను తెరకెక్కించాను. ఇది ఫ్లాప్ అవ్వడంతో సినిమా రిలీజైన 24 గంటల్లోనే రెమ్యునరేషన్ మొత్తం వెనక్కిచ్చేయాల్సి వచ్చింది. నిర్మాత కూడా తనకు మిగిలిన లాభం వెనక్కిచ్చేశాడు. పవన్ కల్యాణ్ కొంత రెమ్యునరేషన్ వెనక్కిచ్చారు. అలా మొత్తం అందరికీ సెటిల్ చేసేశాం. అయితే ఈ విషయాన్ని నా భార్య, పిల్లలకు చెప్పడం ముఖ్యం అనుకున్నాను. నేనో సినిమా తీశాను అది ఆడలేదు. కాబట్టి మనం కడదామనుకుంటున్న ఇల్లు ఆపేద్దామనుకుంటున్నాను. మీకేమైనా సమస్యనా? రేపొద్దునా తేడా ఏమైనా వస్తే దాన్ని అమ్మేస్తానని అనగానే.. ఇది ఉంది కదా ఇది కూడా ఇల్లే కదా అని అన్నారు. దీంతో అది సమస్య కాదని అనిపించింది . ఆ తర్వాత భోజనం చేసి సంతోషంగా ఓ సినిమా చూసి పడుకున్నాను'

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3 88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH 521151.